www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 11 మే 2025
5
చిత్తూరు

రేపు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈ నెల 12వ తేదీ సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు ఉదయం 9 గంటల కల్లా తప్పక హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. దీనితో పాటు నియోజక వర్గ, మండల స్థాయిలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నియోజకవర్గ, మండల స్థాయి అధికారులందరూ విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

వేతన బకాయిలు చెల్లించండి సారూ..!

102 డ్రైవర్ల భిక్షాటన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గత రాష్ట్ర ప్రభుత్వం 2016లో గ్రామీణ ప్రాంతంలో ఉన్న గర్భిణులకు సురక్షితంగా ప్రసవం జరగాలనే లక్ష్యంతో తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ వాహనాలను ఏర్పాటు చేసింది. వాటి నిర్వహణను అరబిందో ఏజెన్సీకి అప్పగించి వాహనాలకు డ్రైవర్ల ఏర్పాటు చేసింది. తల్లీబిడ్డల సంరక్షణ చూస్తున్న డ్రైవర్లకు గత ఐదు నెలలగా జీతాలు అందక ఇబ్బంది పడుతూ వున్నామని, రోజు గడిచే పరిస్థితి లేదని, తమకు అడుక్కోవడమే గతి ఏర్పడిందని శనివారం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ తల్లీబిడ్డల సంరక్షణ పేరుకు మాత్రమే గానీ అందులో ఆ వాహనాల ప్రయాణించే వారికి మాత్రం సంరక్షణ కరువైందన్నారు. వాహనాలు కండిషన్ బాగాలేక ఎప్పుడు ఏమి జరుగుతుందో అని భయంతో డ్రైవర్ల జాగ్రత్తగా తల్లీబిడ్డలను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని భయంతో చేరుస్తున్నారని తెలిపారు. 2016 నుండి ఏజెన్సీ వారు డ్రైవర్లు దగ్గర వెట్టిచాకిరి చేయించుకుంటూ రూ.7800లు అతి తక్కువ వేతనాలు ఇస్తున్నారని, అవి కూడా నెలనెలా ఇవ్వకుండా సంవత్సరానికి ఒకసారి, ఆరు నెలలకు ఇస్తుంటే వారి కుటుంబాలు ఎలా గడవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో పనిచేస్తున్న డ్రైవర్ల అందరూ పేదవారని, వేతనాల మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న వారే అని అటువంటి వారికి ప్రస్తుతం ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులు పడుతుంటే బిక్షాటన చేసి బతకాల్సిందేనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేవ చేస్తున్న డ్రైవర్లను బిచ్చగాలుగా మార్చడమేనా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికారులు వెంటనే స్పందించి తల్లీబిడ్డలకు సేవలు అందిస్తున్న తల్లీబిడ్డల ఎక్స్రెస్ డ్రైవర్లకు వేతనాలు అందించి, కొత్త వాహనాలు ఇవ్వాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, వారికి భద్రత కల్పించాలని, ఇన్సూరెన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరవధిక సమ్మెకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు.

బిక్షాటన చేస్తూ నిరసన తెలుపుత్తున్న 102 డ్రైవర్లు

గిట్టుబాటు ధర దక్కేనా..?

- అయోమయంలో మామిడి రైతులు
- అకాల వర్షాలతో పంట నష్టం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ప్రజాదృష్టి

మామిడి గుజ్జు పరిశ్రమల్లో గల్ఫ్ యుద్ధం ఫలితంగా గత ఏడాది ఎగుమతులు ఆగిపోవడంతో ఈ సంవత్సరం మామిడి గిట్టుబాటు ధరపై రైతులను అయోమయం నెలకొంది. మరో 20, 25 రోజుల్లో మామిడి సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ఏడాది మామిడి గుజ్జు పరిశ్రమలు ఏ మేరకు పనిచేస్తాయనేది ప్రశ్నార్థకంగా మారింది.. గత రెండు సంవత్సరాలుగా జిల్లాలోని 70 మామిడి గుజ్జు పరిశ్రమల్లో ఎగుమతులు ఆగిపోవడంతో భారీ ఎత్తున మామిడి గుజ్జు నిల్వలు పేరుకుపోయాయి. ఎగుమతులు లేక అల్లాడుతున్న గుజ్జు పరిశ్రమలు ఇప్పటికే బ్యాంకు రుణాల చెల్లింపును వాయిదా వేయడంతో పాటు తమను ఆదుకోవాలంటూ ప్రభుత్వానికి పదేపదే విజ్ఞప్తిలు చేస్తున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఏ మేరకు తోతాపూరీ రకాన్ని కొనుగోలు చేసి గుజ్జు పరిశ్రమలు మామిడి తోడ్పడుతాయనేది వేచి చూడాలి.

జిల్లాలో 70 వేల హెక్టార్లలో మామిడి పంట సాగులో ఉంది. ఒక హెక్టారుకు 3 నుండి 3.5 టన్నుల పంట దిగుబడి వస్తుంది. దీని ప్రకారం 5.5 లక్షల టన్నుల మామిడి దిగుబడి ఉంది. మామిడి గిట్టుబాటు ధర ప్రస్తుతం ఒక టన్నుకు రూ.25వేల వరకు ఉంది. మామిడి రైతులకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నుండి ప్రోత్సాహకాలు అందేలా చూడాల్సి ఉంటుంది. గతేడాది పంట దిగుబడి తక్కువ ఉన్న తోతాపూరి రకం టన్ను మొదటి దశలో 25,000 విక్రయించబడినప్పటికీ సీజన్ చివరికి టన్ను రూ.15వేలకు మించి అమ్ముడుపోలేదు. జిల్లాలోని పల్ఫ్ పరిశ్రమల్లో పేరుకుపోయిన మామిడి గుజ్జు నిల్వలను జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలకు వచ్చే భక్తులకు, ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకోవాలని మామిడి గుజ్జు పరిశ్రమల సమాఖ్య నేతలు ప్రభుత్వాన్ని పదేపదే విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ప్రతిపాదన మేరకు అమలు అవుతోందో లేదో వేచి చూడాలి.

అకాల వర్షాలతో పంట నష్టం

గత వారం రోజులుగా ఈదురు గాలులు అకాలవర్షాలతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అకాల వర్షాలకు నేల రాలుతున్న మామిడి మార్కెట్లో టన్ను రూ.10 నుంచి 15 వేలు కూడా అమ్ముడుపోవడం లేదు. జిల్లాలోని చిత్తూరు, దామలచెరువు, పలమనేరు, బంగారు పాల్యం మామిడి మండీల్లో అమ్ముడుపోని మామిడికాయలు నిల్వలు ఉన్నాయి. అకాల వర్షాలకు దెబ్బతిన్న మామిడి పంటను అంచనావేసి మామిడి రైతులను ఆదుకోవాలని జిల్లాలోని మామిడి రైతులు కోరుతున్నారు.

గాలివానకు నేల రాలిన మామిడి

పోలీసుల మాక్ డ్రిల్

మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉగ్రవాదులు దాడులు జరిగితే అత్యవసర సమయంలో గ్యాస్ స్టేషన్‌లో ఎలా ఎదుర్కోవాలి, భద్రతా ప్రమాణాలను పరిశీలించి, మాక్ డ్రిల్ పోలీసులు నిర్వహించారు. పూతలపట్టు ఇండియన్ గ్యాస్ యూనిట్‌లో శనివారం జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు ఏఆర్.అడిషనల్ ఎస్పీ శివానంద కిషోర్ పర్యవేక్షణలో మాక్ డ్రిల్ నిర్వహించారు. గ్యాస్ యూనిట్ వంటి కీలక ప్రదేశాల్లో ఉగ్రదాడులు జరిగినప్పుడు ఉద్యోగులు తీసుకోవాల్సిన తక్షణ చర్యలు, సైరన్లు మోగినప్పుడు అనుసరించవలసిన భద్రతా ప్రోటోకాల్స్, బాంబు బెదిరింపుల సమయంలో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ చర్యలు, అలాగే హెల్త్, ఫైర్ రెస్పాన్స్ టీమ్‌ల పాత్రను ఈ డ్రిల్‌లో ప్రాక్టికల్‌గా చూపించారు. ఐఓసిఎల్ వంటి ఇంధన సంస్థలు ఉగ్రవాదులకు లక్ష్యంగా మారే అవకాశం ఉన్నందున భద్రతాచర్యలు అత్యంత కీలకమని పోలీసు అధికారులు పేర్కొన్నారు. మానవ వనరుల పనితీరు, అప్రమత్తత స్థాయిలను కూడా అధ్యయనం చేశారు. పారిశ్రామిక సంస్థలు తమ స్థాయిలో భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పోలీసులు ఎప్పుడూ కలిసి పనిచేస్తారని హామీ ఇచ్చారు. స్థానికంగా అనుమానాస్పదంగా ఉన్న బ్యాగులు, ప్యాకెట్లు, పరికరాలను సిబ్బంది తాకకూడదని, వెంటనే పోలీసులకు లేదా బాంబ్ స్క్వాడ్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా బాంబ్ డిస్పోజల్ ప్రక్రియ వేగవంతం అవుతుందన్నారు. గ్యాస్ స్టేషన్‌ల్లో అగ్నిప్రమాదం సంభవించే అవకాశం ఎక్కువగా ఉండడంతో, ఫైర్ ఎక్స్టింగ్విషర్‌ల వినియోగం వాటిని ఎలా వాడాలి, ఎప్పుడు వాడాలనే అంశాలపై ప్రాక్టికల్ డెమో నిర్వహించారు. డ్రై కెమికల్ ఫైర్ ఎక్స్టింగ్విషర్‌లు, సాండ్ బాక్స్‌లు వంటి పరికరాలను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అలాగే స్టేషన్‌లో ఉన్న ఫస్ట్ ఎయిడ్ కిట్ వాడకం, గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స అందించే విధానం కూడా చూపించారు. ప్రమాదం తీవ్రంగా ఉన్నప్పుడు అంబులెన్స్‌కు మార్గం చూపించడం, గాయపడినవారిని స్ట్రెచర్‌లపై సురక్షితంగా తరలించడం, అవసరమైతే ఆక్సిజన్ సపోర్ట్ అందించడం వంటి అంశాలు ప్రాక్టికల్‌గా వివరించారు.

మామిడి తోటపై ఏనుగుల దాడి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఏనుగుల నివారణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు వాపోయారు. శుక్రవారం రాత్రి మండలంలోని మొగిలి గ్రామంలో గల శ్రీనివాసులు మామిడి చెట్లను ఏనుగులు విరిచి ధ్వంసం చేశాయి. తరచూ ఏనుగుల సంచారం ఎక్కువ అవుతోందని, వాటిని నివారించేందుకు అధికారులు తగిన ఏర్పాట్లు చేయకపోవడంతో చేతికొచ్చే పంటను నాశనం చేస్తున్నాయని వాపోతున్నారు. అధికారులు పంట నష్టం తక్కువగా నమోదు చేసి రైతులను అప్పుల ఊబిలో నెట్టుతున్నారని ఆరోపించారు. గతంలో ఇదే ప్రాంతంలోనే అనారోగ్య సమస్యలతో ఓ ఏనుగు, విద్యుత్ షాక్‌తో రెండు ఏనుగు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయని, రైతులతో పాటు ఏనుగులను సంరక్షించాల్సిన ఫారెస్టు అధికారులు నిర్లక్ష్యం ధోరణితో వ్యవహరించడం వలన అటు ఏనుగులకు ఇటు రైతులకు భారీ నష్టం జరుగుతోందని తెలిపారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి కందకాలు, సోలార్ పెంసింగ్ ఏర్పాటు చేసి ఏనుగుల దాడి నుంచి రైతులను, పంటలను కాపాడాలని కోరుతున్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్యాబోధనే లక్ష్యం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విద్యార్థులకు గుణాత్మక విద్యాబోధనే లక్ష్యంగా చిత్తూరులోని సంసిద్ క్యాంఫర్డ్ స్కూల్స్, టాటా గ్రూపుకి చెందిన క్లాస్ ఎడ్జ్ వ్యూహాత్మక విద్య భాగస్వామ్యంలో విద్యా బోధనకు శ్రీకారం చుట్టినట్లు స్కూల్స్ నిర్వాహకులు శ్రీనివాసరావు, సిఆర్ మహేష్ రెడ్డి తెలిపారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు విద్యా కార్యక్రమం వివరాలను వెల్లడించారు. సాంకేతిక ఆధారిత తరగతులు, నాయకత్వ వికాసం, విలువల పెంపకం, విద్యా నెట్వర్క్ విస్తరణ, భవిష్యత్ నైపుణ్య అభివృద్ధిని అనుసరించే విద్యా విధానమని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు విద్య అనుభవాలను మారుస్తూ.. ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంచే దిశగా తమ కరికులం ఉంటుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉన్నత విద్యను బోధన వైపు దృష్టి సారించాలని సూచించారు.

సిహెచ్‌ఓల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని సిహెచ్‌ఓల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు కోరారు. శనివారం సిఐటియు కార్యాలయంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని సమ్మెను విరమింప చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. సిహెచ్‌ఓల న్యాయమైన సమస్యల పరిష్కారం చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ప్రభుత్వం లక్ష్యం నెరవేరకుండా నీరు గారడానికి ప్రధాన కారణం ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరేనని అన్నారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో ప్రజలకు వైద్యసేవలు అందక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉందన్నారు. ఆర్థిక భారం కానీ సమస్యలు వెంటనే పరిష్కరించి సిహెచ్‌ఓల సమ్మెను విరమించే విధంగా చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తును జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. చట్టం ప్రకారం ఔట్సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి అందరిని పర్మినెంట్ చేయాలని, పనిభారం తగ్గించాలని, మహిళలపై జరుగుతున్న వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల రద్దు దేశ భవిష్యత్తు కోసం 20న జరిగే వ్యాప్తంగా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంగరాజు

ప్రేమ పేరుతో మోసం..

పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన యువతి

విలేకరులకు వివరాలు తెలుపుతున్న బాధిత యువతి

ప్రజాశక్తి- పుంగనూరు: గత నాలుగేళ్లుగా ప్రేమిస్తున్నానని మాయ మాటలు చెబుతూ పెళ్లి చేసుకోమంటే తనకేమీ సంబంధం లేదంటూ మోసగించాడని ఓయువతి పోలీసులను ఆశ్రయించిన సంఘటన శనివారం పుంగనూరు అర్బన్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధిత యువతి మీడియాతో మాట్లాడుతూ.. తాము పట్టణంలోని శాంతినగర్ కాలనీలో నివాసముంటున్నామని, మైనార్టీ కుటుంబం అయిన వారు చిన్నచిన్న పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వారమని తెలిపారు. ఈ క్రమంలో అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం చింపరపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి తమకు ఆర్థికంగా సాయం చేస్తూ వడ్డీకి డబ్బు ఇస్తూ ఇంటికి వస్తూ పోతూ ఉండేవాడని, తమ కుటుంబ సభ్యులతో సన్నిహితంగా మెలిగే వాడని తెలిపారు. గత నాలుగేళ్లుగా తనని ప్రేమిస్తున్నానని నమ్మించి గర్భవతిని చేశాడని, ఇప్పుడు తాను గర్భవతినని పెళ్లి చేసుకోమని అడుగుతుంటే తనకు ఏమీ సంబంధం లేదని, నీకు దిక్కున్న చోట చెప్పుకో అంటూ బెదిరింస్తున్నాడని తెలిపారు. దీంతో పోలీసులను ఆశ్రయించామని, న్యాయం చేయాలని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం గిరిధర్ గుప్తా అధ్యక్షతన సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగింది. ఈసమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాంచివరం సురేంద్రన్ మాట్లాడుతూ లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులు, ఉద్యోగస్తులు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కోబోతున్నారని, అనేక దశాబ్దాలుగా సాధించుకున్న హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు. బడా కార్పొరేట్లకు బహుళ కంపెనీలకు అమ్ముడుపోయి కార్మికులకు అండగా ఉన్న అనేక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను నాశనానికి కేంద్ర ప్రభుత్వం పూనుకోవడం అతి దారుణమన్నారు. ప్రజాస్వామ్య దేశంలో కార్మికులు, కర్షకులు ఉద్యోగస్తులు లేకుండా సమాజం ముందుకు పోదని, కేంద్ర ప్రభుత్వం ఇది గమనించకుండా కొద్దిమంది కోటీశ్వరుల కోసం లేబర్ కోడ్లను తీసుకొని రావడం హేతు రహితమన్నారు. గతంలో కర్షకులు అనేక పోరాటాలు చేసిన తర్వాత వ్యవసాయ నల్ల చట్టాలను వెనక్కి తీసుకున్నారని, కార్మికుల కూడా అదే ఉత్సాహంతో మే 20వ తారీకు జరుగుతున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కోట్లాది మంది కార్మికులు, కర్షకులు, ఉద్యోగస్తులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి వచ్చేలా ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఓబుల్ రాజు మాట్లాడుతూ అనేక పోరాటాలు ఫలితంగా వ్యవసాయ నల్ల చట్టాలను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుందని, కార్మికుల గుండెల్లో గుణపం గుచ్చేలా లేబర్ కోడ్‌లను తీసుకురావడం న్యాయం కాదని అన్నారు. కేంద్రానికి బుద్ధి వచ్చేలా కార్మికులు, కర్షకులు, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు కలిసి ఉద్యమం ఉధృతం చేయాలని 20న జరగబోతున్న సార్వత్రిక సమ్మెను రైతులు, వ్యవసాయ కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు మాట్లాడుతూ గత మూడు వారాలుగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. 20న జరుగుతున్న సార్వత్రిక సమ్మెకు సిహెచ్ ఓలు కూడా మద్దతు పలకాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కార్యదర్శి మధు, గోవిందప్ప, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంగా, సిహెచ్‌ఓ నాయకులు రషీద్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకుందాం..

- యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్

శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

ప్రజాశక్తి- గంగవరం: యుటిఎఫ్ చిత్తూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం ఒక్క రోజు శిక్షణా తరగతులను స్థానిక మధర్ తెరిసా కాలేజీలో శనివారం నిర్వహించారు. శిక్షణా తరగతులకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని రక్షించుకోవడానికి, ప్రభుత్వ బడులను కాపాడుకోవడానికి యుటిఎఫ్ చేసిన పోరాటలను వివరించారు. ఇకపై కూడా అదే పోరాటాల ద్వారా ప్రభుత్వ బడులను నిలుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి పంచాయతీకి ఒక మోడల్ స్కూల్‌ను మంజూరు చేయాలని, ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన అందించాలని కోరారు. ఉపాధ్యాయ సంఘాలు లేవనెత్తిన సమస్యలు పరిష్కరించాలని, ఉపాధ్యాయ బదిలీలను పారదర్శకంగా జరపాలని, ఉద్యోగోన్నుతల ద్వారా ఖాళీలను భర్తీ చేయాలని, మెగా డీఎస్సీ ద్వారా వెంటనే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధ్యాయుల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తూ తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంచాలని తెలియజేశారు. యుటిఎఫ్ మాజీ ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు ఎస్ఎస్.నాయుడు, జివి.రమణ, జిల్లా అధ్యక్షులు ఎం.సోమశేఖర నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.మణిగండన్, జిల్లా గౌరవ అధ్యక్షులు పి.సుధాకర్ రెడ్డి, జిల్లా నాయకులు జి.రాధాకృష్ణ, కె.రెడ్డెప్ప నాయుడు, ఎస్.రెహనా, కె.ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి కూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి- కుప్పం టౌన్: అకాల వర్షానికి పంటను నష్టపోయామని కుప్పం పరమసముద్రం ప్రాంతానికి చెందిన దేవయాని, మునస్వామి దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ పరమసముద్రంలో వారు తమ పొలాల వద్ద ఇంటితోపాటు ఆవుల షెడ్డు నిర్మించుకుని కాపురం ఉంటున్నట్టు తెలిపారు. శుక్రవారం రాత్రి ఈదురు గాలులకు ఆవుల షెడ్డు పైకప్పు ఎగిరి, తమ పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభంపై పడడంతో, విద్యుత్ స్తంభం కూలిపోయిందని, ఆ స్తంభానికి ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్ నేలకూలినట్టు తెలిపారు. విద్యుత్ స్తంభం కూలిన సమయంలో అదృష్టవశాత్తు విద్యుత్ అంతరాయం ఉండడంతో పెను ప్రమాదం తప్పిందని లేకుంటే పెను ప్రమాదం జరిగేదని తెలిపారు. ఈ వర్షం వలన వరి పంటకు కూడా నష్టం వాటిల్లిందన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

గాలివానకు విరిగిపడ్డ విద్యుత్ స్తంభం

అమరవీరులకు నివాళి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: శనివారం సాయంత్రం స్థానిక గాంధీ సర్కిల్ వద్ద చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో భారత సేనకు సంఘీభావం తెలిపి, అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు తాండవ మూర్తి, కార్యదర్శి గోపి నాయక్, వైస్ ప్రెసిడెంట్లు సీనియర్ జర్నలిస్ట్ సత్య, రిటైర్డ్ ఎస్సై మురళి, హ్యూమన్ రైట్స్ శోభారాణి, సీనియర్ జర్నలిస్టులు కృష్ణసింగ్, వరద, రిటైర్డ్ ఎస్సై రషీద్, చిన్న, వకీలు శ్రీనివాసు బాబు, నాయకులు పాల్గొన్నారు. అలాగే మాజీ సైనికుల సంక్షేమ అధికారి కెవి రాఘవులు ఆధ్వర్యంలో భారత్ పాకిస్తాన్ యుద్ధ నేపథ్యంలో జిల్లాలోని మాజీ సైనికులు స్థానిక గాంధీ విగ్రహం ఎదుట శనివారం వీరమరణం పొందిన సైనికులకు నివాళులర్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

అధికారుల స్పందన

- పైపులైను గోతి పూడ్చివేత -'ప్రజాశక్తి' వార్తకు స్పందన

పైపులైను గోతిని పూడ్చివేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: 'పొంచి ఉన్న ప్రమాదం.. పట్టించు కోరా?' అనే శీర్షికన ప్రజాశక్తిలో శనివారం ప్రచురిత మైన వార్తకు అధికారులు స్పందిం చారు. మండలం లోని తగ్గు వారి పల్లి పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో తాగునీటి పైప్ లైన్ మరమ్మతు కోసం తవ్విన గోతి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి స్పందించి పంచాయతీ పారిశుధ్య కార్మికుల ద్వారా మట్టిని గోతికి పూడ్చి వేశారు. 'ప్రజాశక్తి' దిన పత్రికలో వెలువడిన వార్తకు అధికారులు స్పందించడంతో సమస్య పరిష్కారమైందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

సైన్యానికి మద్దతుగా ప్రదర్శన

విద్యార్థులతో ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గంగవరం: భారత సైన్యానికి, ప్రభుత్వానికి మద్దతుగా తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో జాతీయ జెండాలు పట్టుకుని శనివారం ప్రదర్శన నిర్వహించారు. కళా మందిరం నుండి జాతీయ రహదారి వరకు ప్రదర్శన నిర్వహించి జాతీయ రహదారిలో మానవహారం ఏర్పాటు చేసి పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు పి తులసినాథం నాయుడు మాట్లాడుతూ శాంతి దేశమైన భారత దేశాన్ని ఇతరులు కవ్విస్తే ఐక్యంగా ప్రతీకారం తీర్చుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ కార్యదర్శి పుష్ప, గుణశేఖర్, సీతారామయ్య, నరేంద్రబాబు భార్గవి, దేవేంద్ర, నవ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పుంగనూరు: దేశ భద్రత కోసం తన ప్రాణాలను పణంగా పెట్టి వీర మరణం పొందిన మురళి నాయక్ త్యాగం మరువలేనిదని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్, ఏపీజే అబ్దుల్ కలాం, వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్కే అయూబ్ ఖాన్‌లు అన్నారు. మురళి నాయక్ కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలంటూ పుంగనూరు పట్టణంలో పలు ప్రాంతాలలో శనివారం నివాళులర్పించారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్లో దళిత సంఘాలు, బీసీ సంఘాలు, ఎంపీటీ రోడ్డు ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు బి నరసింహులు, బీసీ సంఘం నాయకుడు కృష్ణమూర్తి, గంగరాజు, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సభ్యులు రాజా, రామయ్య, నాగేనాయక్, దళిత సంఘ నాయకుడు మాజీ కౌన్సిలర్ కృపాకర్, పీఎంపీ వైద్యులు అమర్నాథ్ పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరు పట్టణంలో శనివారం సాయంత్రం ఏడు గంటలకు భారత పాకిస్తాన్ యుద్ధంలో మృతి చెందిన వీర జవాన్ మురళి నాయక్‌కు మాజీ సైనికులు ఘన నివాళి సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులు, పెన్షనర్స్ సభ్యులు, ప్రముఖులు కలిసి కొవ్వొత్తులతో ర్యాలీగా వచ్చి పలమనేరు టవర్ క్లాక్ వద్ద మురళి నాయక్ చిత్రపటానికి ఘన నివాళి సమర్పించి వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కుప్పం రూరల్ : కుప్పం పట్టణంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహ వేదికగా జవాను మురళి నాయక్ కు ఘన నివాళులు అర్పించారు. ముందు సామాజిక కార్యకర్త శివశంకర్, ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసిపి అధికార ప్రతినిధి భాస్కర్ నాయక్ నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ముఖ్యంగా వారి తల్లిదండ్రుల జీవితకాలం వారికి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గిరిప్రసాద్, ప్రభాకర్, మోహన్, పలువురు ప్రజాసంఘ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా అభిషేక పూజలు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి రిలోని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో కోనేటి వద్ద ఉన్న సంతాన వేణుగోపాల స్వామికి శనివారం అభిషేకం పూజలు వైభవంగా నిర్వహించారు. ప్రధాన ఆలయంలో శనివారం స్వామి అమ్మవార్లను సుప్రభాత సేవతో మేలుకొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్ల వెంకటేష్ రెడ్డి, ఆలయ అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

'మదర్ థెరిసా' విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి- గంగవరం: విడుదలైన ఎస్‌వి యూనివర్సిటీ ఐదవ సెమిస్టర్ ఫలితాలలో మదర్ థెరిసా కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు ఆ కళాశాల కస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. ఈ ఫలితాలలో బీకాం చదువుతున్న బి కరిష్మా 9.25 శాతం, వసంత కుమార్ 9.19, కుసుమ 9.15 శాతం మార్కులు సాధించారని తెలిపారు. బిబిఏ చదువుతున్న ఎస్ మహీం 9.17 శాతం, చందు 9.3 శాతం, బిఎస్సి చదువుతున్న రోహిణి 9.16 శాతం మార్కులు పొందారన్నారు. అశ్విని 9.16 శాతం, సాజీద బేగం తొమ్మిది, 9.13 శాతం, వర్షిత 9.2 శాతం, విష్ణు 9.1, బీసీఏ చదువుతున్న తనుజ 9.12 , శ్రావణి 8.93 శాతం మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారని తెలిపారు. 265 మంది డిస్టెన్స్ లో పాసయ్యారని, 75 మంది ప్రథమ శ్రేణిలో పాసై కళాశాలకు పేరు తీసుకొచ్చారని ఈ సందర్భంగా ఛైర్మన్ సునీల్ బాబు, అకాడమీ అధికారి రాజేంద్రరెడ్డి విద్యార్థులను, వారికి సహకరించిన అధ్యాపకులు , తల్లిదండ్రులను అభినందించారు.

గంగజాతర భద్రత ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు పట్టణంలో నవంబరు 30 వ తేదీ గంగ జాతర చాటింపు ప్రారంభమైంది. గంగ జాతర ఈనెల 14,15,16 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తీసుకోవలసిన భద్రతా చర్యలపై పలమనేరు సిఐ నరసింహరాజు, ఎస్ఐ స్వర్ణ తేజ శనివారం మధ్యాహ్నం గంగమ్మ గుడి ఆవరణలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గంగమ్మ గుడి చైర్మన్, పాలకమండలి సభ్యులకు గుడి ఆవరణంలో తీసుకోవాల్సిన కట్టుదిట్టమైన భద్రత చర్యలను , క్యూలైన్ల ఏర్పాట్ల గురించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐ నరసింహరాజు మాట్లాడుతూ గంగ జాతర రోజు జరిగిన యువకుడికి కత్తిపోట్లు ఘటనను దృష్టిలో ఉంచుకొని శిరస్సు, జాతర రోజుల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆకతాయిలు ఎవరైనా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే , శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని కఠిన చర్యలు తీసుకుంటామని జాతర ప్రశాంతంగా జరగడానికి పలమనేరు పుర ప్రముఖులు అందరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని సూచించారు.

దొంగల బెడద..గుండెలు దడదడ !

- ఎవరూ లేని గృహాలే లక్ష్యం
- ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి- పూతలపట్టు: మండలంలో దొంగల బెడద అధికంగా వుంది..ఎవరూ లేని గృహాలే లక్ష్యంగా సాగుతున్నారు. అప్రమత్తతే రక్షణ కల్పిస్తుందని పలువురు పేర్కొంటున్నారు. పోలీసు స్టేషన్ల ఎదురుగా వున్న ఇళ్లలోనూ చోరీలు జరుగు తున్నాయంటే దొంగలు ఎంత నిర్భయంగా చోరీలకు పాల్పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు..సంబంధిత పోలీసు శాఖాధికారులు దొంగల బెడద నివారణకు చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఎవరూ లేని గృహాలే లక్ష్యం

ఇంట్లో ఎవరూ లేని గృహాలనే దొంగలు ఎంచుకుంటున్నారు. పూతలపట్టు మండల కేంద్రంలో జాతీయ రహదారి పక్కనే వున్న చిన్నస్వామి నాయుడు, జయరామనాయుడు నివాస గృహాల్లో గత ఆదివారం దొంగలు పడ్డారు. అందులోనూ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఈ గృహాలు ఉండడం గమనార్హం. ఒకే రోజు రెండు గృహాల్లో భారీ ఎత్తున చోరీలు చోటు చేసుకున్నాయి. 250 గ్రాముల బంగారం, 500 గ్రాములు వెండి చోరీకి గురైంది.

మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో మూడు నెలల క్రితం ఇంటి ముందు ఉన్న ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఇక వారపు సంతల్లో జాతీయ రహదారిపై చోరీలు అప్పుడప్పుడూ జరుగుతూనే ఉన్నాయి. ఈ విషయాలపై పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నా ఫలితం శూన్యమని పలువురు పేర్కొంటున్నారు.

ఏడాది క్రితం మండలంలోని ముత్తిరేవుల గ్రామంలో విశ్రాంత ఎంఈఓ కృష్ణారెడ్డి ఇంటిలో పట్టపగలు దుండగులు చొరబడి పెద్ద ఎత్తున బంగారం, నగదు దోచుకెళ్లారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ చోరీపై ఎలాంటి పురోగతి లేదు. బాధితులు పోలీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు.

పూతలపట్టు మండలం దొంగలకు ఆవాసంగా మారింది. చోరీలు నిత్య కృత్యమయ్యాయి. ముఖ్యంగా అర్ధరాత్రి, తెల్లవారుజామున చోరీలు జరుగుతు న్నాయి. కళ్లు మూసి తెరిచేలోపు విలువైన వస్తువులు మాయమవుతున్నాయి. ప్రజలు ఏమర పాటుగా ఉండడాన్ని గమనించి దోచేస్తున్నారు. వారపు సంతల్లో సెల్ ఫోన్లు మాయమవుతున్నాయి. సెల్ ఫోన్లలో విలువైన సమాచారం డేటా ఉండడంతో బాధితులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారు కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేయకుండానే వెళ్లి పోతున్నారు. దీనివల్ల చోరీలు వెలుగులోకి రావడం లేదు. పోలీసులకు ఫిర్యాదు చేసినా రికవరీ అంతంత మాత్రం గానే ఉంటున్నాయి. మొత్తం సీసీ కెమెరాలు ఉన్నా దొంగతనాలు ఆగడం లేదు. నేరగాళ్లు దొరకడం లేదు.

గత వారం చోరీకి గురైన రెండు గృహాలు ఇవే..

ఆందోళనలో ప్రజలు

అసలే వేసవి తాపంతో ప్రజలు విలవిల లాడుతున్నారు. ఉక్కపోతతో రాత్రి సమయాల్లో గృహాల్లో నిద్రించ లేకపోతున్నారు. చాలామంది ఆరు బయట నిద్రించడానికి ఆసక్తి చూపుతున్నారు. కానీ ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలతో.. దొంగలకు భయపడి చాలామంది ఆందోళనలతో కష్టమైనా గృహాల్లోనే పడు కుంటున్నారు. పగటి పూట కూడా ఇల్లు వదిలి వెళ్లడానికి భయ పడుతున్నారు. వరుస చోరీలు జరుగుతున్నా పోలీసులు మాత్రం ఎలాంటి నిఘా చూపడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యుద్ధంపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అప్రమత్తత అవసరం

జిల్లా అగ్నిమాపక అధికారి పెద్దరెడ్డి

ప్రజాశక్తి- పూతలపట్టు : భారత్, పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధ వాతావరణంలో భాగంగా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా అగ్నిమాపక అధికారి పెద్దరెడ్డి అన్నారు. శనివారం ఉదయం పూతలపట్టు పోలీస్ స్టేషన్లలో ప్రస్తుత యుద్ధం గురించి.. ముందు జాగ్రత్తలపై మాక్ డ్రిల్ గురించి క్లుప్తంగా వివరించారు. మండలంలోని ఐఓసీ ప్లాంటులో అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డిస్టిక్ ఫైర్ ఆఫీసర్ కరుణాకర్ , ఏఆర్ అడిషనల్ ఎస్‌పి నంద కిషోర్, ఏఆర్ డిఎస్‌పి చిన్నికృష్ణ, చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, తహశీల్దారు రమేష్ బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గంగమ్మ గుడికి రూ.2.29 లక్షల ఆదాయం

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు తిరుపతి గంగమ్మ ఆలయంలో దుకాణాలకు సంబంధించి శనివారం వేలంపాట నిర్వ హించగా రూ.2.29 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కమిటీ ఛైర్మన్ శ్రీధర్ నాయుడు, ఈఓ కమలాకర్ తెలిపారు. ఈ నెల 14 నుంచి 16 వరకు నిర్వహించనున్న జాతరలో అంగళ్ల ఏర్పాటుకు ఈ వేలంపాట నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు శేఖర్

అధ్యాపకులు బాధ్యతగా పని చేయాలి

ప్రజాశక్తి -కార్వేటినగరం: అధ్యాపకులు బాధ్యతగా విధులు నిర్వహించాలని జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ అన్నారు. శనివారం 17 మంది ఆధ్యాపకులు వివిధ పాఠశాలల నుంచి బదీలపై డైట్ కళాశాలలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని, ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలన్నారు.

రేపు సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మండలంలోని కుమ్మరపల్లిలో వెలిసిన శ్రీ కోదండ రామచంద్ర ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం సీతాసమేత కోదండరామస్వామి కళ్యాణోత్సవం నిర్వహిస్తారని, అనంతరం గ్రామానికి చెందిన వసంతమ్మ, గడ్డం గోవిందరెడ్డి కుటుంబ సభ్యుల ద్వారా అన్నదానం నిర్వహిస్తారని శ్రీ కోదండ రామస్వామి సేవా ట్రస్ట్ ఒక ప్రకటనలో తెలిపింది.

హనుమంత వాహనంపై కోదండరాముడు

ప్రజాశక్తి -గంగవరం: మండలంలోని కీలపట్ల గ్రామంలో వెలసి ఉన్న కోనేటిరాయ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం హనుమంత వాహనంపై కోదండ రాముడు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం వసంతోత్సవాన్ని సంప్రదాయబద్ధంగానిర్వహించారు. కీలపట్ల పురవీధులలో శ్రీదేవి భూదేవి సమేత కోనేటి రాయ స్వామి వారిని ఊరేగించారు. ఈ ఉత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో యాచకుడు మృతి

ప్రజాశక్తి -పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరు పట్టణంలోని రంగబాబు సర్కిల్ వద్ద ఓ యాచకుడు శుక్రవారం అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండగా స్థానికులు 108 ద్వారా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యం విషమించి శనివారం మృతి చెందాడు. పలమనేరు సిఐ. నరసింహరాజు సూచనల మేరకు ఆ మృతదేహానికి శనివారం గాంధీనగర్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇందులో హెల్పింగ్ హ్యాండ్స్ శివ, శక్తి ప్రసాద్, మురుగ, హరి పాల్గొన్నారన్నారు.

తేలికపాటి వర్షం

చెరువులను తలపిస్తున్న రోడ్లు

రాగిమాను పెంటకు వెళ్లే రహదారి నీళ్లతో నిండిన దృశ్యం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: తేలికపాటి వర్షానికి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్లగాడు గ్రామంలో బంగారు పాళ్యం నుంచి తుంబపాల్యం వెళ్లే రహదారిలో ప్రభుత్వం చేపట్టిన సిసి రోడ్లలో గుంతలు ఉండడంతో శుక్రవారం రాత్రి కురిసిన వర్షపు నీరంతా రహదారిపై నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. దీనిపై గతంలోనే పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించ లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి మీదుగా దాదాపు పది గ్రామాలకు ద్విచక్ర వాహనాల్లో వాహనదారులు ప్రయాణి స్తుంటారు. నీటి వల్ల ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టి రహదారిపై నీరు నిల్వ లేకుండా చూడాలని కోరుతున్నారు.

కుప్పం విద్యార్థుల ఉత్తమ ప్రతిభ

బి సి ఎన్ విద్యాసంస్థల విద్యార్థులు

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : తిరుపతి ఎస్‌వి విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో కుప్పం పరిసర ప్రాంతాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని ఆయా కళాశాలల యాజమాన్యం, ప్రిన్సిపాళ్లు తెలిపారు. రాష్ట్రంలోని చిట్టచివరి నియోజకవర్గం అయిన కుప్పం విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు పోటీపడుతున్నాయి. అందులో ముఖ్యంగా బిసిఎన్ విద్యా సంస్థలలో భాగమైన కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనపరిచారని కళాశాల ఛైర్ పర్సన్ శాంతా నాగరాజు తెలిపారు. తమ కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీ)లో భవాని, అర్చన, బిబిఏలో వర్ష ప్రతీక్ష, బీకాం (సీఏ) లో నిత్యలక్ష్మి, దివ్యశ్రీ, బీఎస్సీ (ఎంఎస్‌సి) భువనేశ్వరి, గణపతి, బిఎస్సి (బిజెడ్‌సి) విగ్నేష్, ప్రవళికలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచినట్లు తెలిపారు. ఫిజిక్స్‌లో 8 మంది, స్టాటిస్టిక్స్‌లో ముగ్గురు, కాస్ట్ కంట్రోల్ టెక్నిక్స్‌లో ముగ్గురు, మ్యాథ్స్‌లో ఇద్దరూ, మేనేజ్‌మెంట్ అకౌంట్స్ లో ఒకరు వందశాతం మార్కులు సాధించారని తెలిపారు.

డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సైతం ఉత్తమ ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపల్ నారాయణ మూర్తి తెలిపారు. కళాశాల మొత్తంపై 87.22 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, ఇది విశ్వవిద్యాలయ స్థాయిలోనే అత్యు త్తమ ఉత్తీర్ణత శాతమని తెలిపారు. కళాశాలకు చెందిన జి వెన్నెల, వి చందన, ఎం మౌనిక, కే ఝాన్సీ, ఆర్ అభిత, ఎం కరుణశ్రీ, ఎస్ వందన, జి అనూయ, వి దామిని, జి రాధిక, డి అమ్ములు, వి వెండామణి, వి సంధ్య, డివి దినేష్, ఎన్‌బి ఐశ్వర్య, కె సంధ్య, జి అమరావతి, ఎన్ వెంకటేష్, జేఆర్ సుప్రిత సాయి భావన ఉత్తమ మార్కులు సాధించారని తెలిపారు. కె పల్లవి, ఎస్ ఉదయ్ కుమార్, సి సతీష్, ఎమ్ ఉమావతి, జి గాయత్రిలు ఉత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయా కళాశాలల యాజమాన్యం, అధ్యాపక బృందం అభినందించారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్య: తహశీల్దారు

-బైరెడ్డిపల్లి: ప్రభుత్వ భూములు ఆక్రమణ చేయడం చట్టరీత్యా నేరం అని, ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమణ చేయడానికి ప్రయత్నిస్తే వారికి సమాచారం అందించాలని తహశీల్దారు అధికారులకు సూచించారు. బేలుపల్లి పంచాయతీ పరిధి భూములను కొంతమంది కబ్జా చేయడంతో తెలుసుకున్న బైరెడ్డిపల్లి తహశీల్దారు యంయస్ ప్రసన్న కుమార్ శనివారం అక్కడికి చేరుకొని సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిగా గుర్తించి ఆక్రమించుకున్న భూమిని సర్వే నిర్వహించి స్వాధీనం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం భూముల్లో బోర్డు అమర్చి ఈ భూముల్లోకి ఎవరైనా ప్రవేశిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలిపారు.

కబ్జా భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్న బోర్డు

చవటగుంట పీఏసీఎస్ ఛైర్మన్ పీఠం ఎవరికో?

- ఇప్పటి వరకూ ఎస్‌సిలకు దక్కని సీటు - అన్ని సామాజిక వర్గాల నాయకులూ నిరీక్షణ

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట పీఏసీఎస్ ఛైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందో? అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ చూపు ఎవరి వైపు వుందో త్వరలో తేలనుంది. ఇప్పటి వరకూ ఛైర్మన్ పీఠం ఎస్‌సిలకు దక్కకపోవడంతో వెదురుకుప్పం మండలంలో పలువురు దళిత నాయకు లు ఎదురు చూస్తున్నారు. వారితో పాటూ వివిధ సామాజిక వర్గానికి చెందిన ఆశావహ నాయకులు ఎదురు చూస్తున్నారు.

రవి యాదవ్

బిఎం రవి

పరకాలకుప్పం సుధాకర్

బోడిరెడ్డి సుధాకర్ రెడ్డి

మండలంలోని చవటగుంట పీఏసిఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం) పరిధిలో 25 గ్రామాలు వున్నాయి. సుమారు 450 మందికి పైనే రైతులు సభ్యత్వం కలిగి వున్నారు. ఈ సంఘం రైతులకు స్వల్పకాలిక రుణాన్ని అందిస్తుంది. రుణ చెల్లింపులను సేకరిస్తుంది. పంపిణీ, మార్కెటింగ్ కార్యకలాపాలు కూడా నిర్వహిస్తుంది. ఈ కార్యకలాపాల పర్యవేక్షణకు ఛైర్మన్‌ను సభ్యులు ఎన్నికల ద్వారా ఎన్ను కుంటారు. అయితే గత కొంత కాలంగా ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రభుత్వాలు ఈ సంఘాలకు ఛైర్మన్‌లను నియమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చవటగుంట పీఏసీఎస్ ఛైర్మన్ పీఠాన్ని పలువురు ఆశిస్తున్నారు.

ఎస్‌సిలకు దక్కని సీటు?

చవటగుంట పీఏసీఎస్ ఏర్పాటైనప్పటి నుండి ఇప్పటి వరకూ దళిత సామాజిక వర్గానికి చెందిన వారికి ఛైర్మన్ పదవి దక్కలేదు. దీంతో వెదురుకుప్పం మండలం యనమలమంద కాలనీకి చెందిన జీడీనెల్లూరు నియోజకవర్గ ఎస్‌సి ఉపాధ్యక్షులు మరకాలకుప్పం సుధాకర్ తనకే వస్తుందని ఆశిస్తున్నారు. వెదురుకుప్పం మండలం వేణుగోపాలపురానికి చెందిన జీడీనెల్లూరు నియోజకవర్గ ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షుడు బీఎం రవి సైతం ఆశిస్తున్నారు. ఇద్దరి ఆశావహుల్లో ఎవరిని వరిస్తుందో ఇంకొంత కాలం ఎదురు చూడాల్సిందే..

ఇద్దరు ఆశావహుల నిరీక్షణ

రెడ్డి సామాజిక వర్గానికి కేటాయిస్తే ఇదే మండలంలోని ఆళ్లమడుగుకు చెందిన తెలుగు యువత జీడీ నెల్లూరు నియోజకవర్గ ఉపాధ్యక్షులు బోడిరెడ్డి సుధాకర్ రెడ్డి తనను వరిస్తుందని పావులు కదుపుతున్నారు. బీసీ సామాజిక వర్గానికి కేటాయిస్తే తనకు ఇవ్వాలని వెదురుకుప్పం మండలం జీటీకండ్రిగకు చెందిన కొట్టే రవి యాదవ్ ఆశిస్తున్నారు. చివరికి ఎవరిని వరిస్తుందో ఎమ్మెల్యే థామస్ నిర్ణయంపై ఆధాపడి వుంటుంది. చివరికి ఛైర్మన్ పదవి దక్కేనో వేచి చూడాల్సిందే.

నిఘానేత్రాలను ఏర్పాటు చేసిన పోలీసులు

రాష్ట్ర సరిహద్దులో నిఘా నేత్రాలు ప్రారంభం

సీఐ శ్రీనివాసులు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: రాష్ట్ర సరిహద్దులో నిఘానేత్రాలను ప్రారంభించినట్టు సీఐ శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండలంలోని కోదలమడుగు పంచాయతీ సామ్నేన్ మిట్ట వద్ద పలమనేరు గుడియాత్తం రహదారిలో నిఘా నేత్రాలను ప్రారంభించామని వీటి ద్వారా ఆంధ్రప్రదేశ్ నుండి అక్రమంగా తరలిస్తున్న సామగ్రిపై నిఘా నేత్రాలు ఉంచామని, అనుకోని సంఘటనలు జరిగినప్పుడు ఈ నిఘా వల్ల ఉపయోగాలు ఏర్పడతాయని జిల్లా అధికారి ఆదేశాల మేరకు నిఘా నేత్రాలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాద్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయంఅందిస్తున్న దృశ్యం

వృద్ధురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్‌కు శశిమ్మ అనే వృద్ధురాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని వయోవృద్ధులకు, ఒంటరి మహిళలకు, విభిన్న ప్రతిభావంతులకు, దీర్ఘకాలిక రోగులకు ఆర్థిక భరోసాను కల్పిస్తూ ఎన్టీఆర్ భరోసా పథకాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ పథకం పొందడానికి తనకు వయస్సు మీరడంతో అన్ని అర్హతలు ఉన్నా తన వేలిముద్రలు కానీ, కంటి పాపలు కానీ సరిపోవడంలేదని తెలిపారు. ఇందుకోసం ఆధార్ అప్‌డేట్ చేయాలంటూ ఆధార్ కేంద్రాలను సంప్రదించినా ప్రయోజనం లేకపోయిందని, వయస్సు మీరడంతో హైదరాబాదు ఆధార్ అప్డేట్ కు ఆధార్ ప్రధాన కార్యాలయాన్ని సంప్రదించాలని తనకు సూచించినట్టు తెలిపారు. అయితే హైదరాబాదు వెళ్లడానికి స్తోమత లేక, సతమతమవుతున్న తన పరిస్థితిని గుర్తించిన కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు తనకు ఆర్థిక సాయం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆయన సాయంతో ఆధార్ అప్‌డేట్ చేయిం చుకుని, ప్రభుత్వం అందిస్తున్న

పెన్షన్ పొందడానికి కల అవరోధాలను అధిగమిస్తానని ఆమె తెలిపారు.

మహోన్నత వ్యక్తి పివిరావు..

ప్రజాశక్తి-పెద్దపంజాణి: రాష్ట్రంలో మాలల అభ్యున్నతికి హక్కుల సాధనకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి పివి రావు అని మండల మాల మహానాడు అధ్యక్షుడు మంజునాథ్ అన్నారు. శనివారం మాల మహానాడు వ్యవస్థాపకులు డాక్టర్ పివి రావు 76వ జయంతి వేడుకలను మంజునాథ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంజు నాథ్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ వర్గాల అభివృద్ధికి వారి సమస్యల పరిష్కారానికి కృషిచేసి ఎన్నో సాంఘిక కార్యక్రమాల్లో పాల్గొని మాలల ఐక్యత కోసం నిరంతరం పోరాటానికి ఐఏఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి మాలల చైతన్యం కోసం పోరాడిన వ్యక్తి పివి రావు అని అన్నారు. ఆయన ఈరోజు మా మధ్య లేడని బాధతో ఆయన అడుగు జాడల్లో ఆయన ఆశయ సాధనకు ప్రజా సంఘాల నాయకులు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓదోటి రెడ్డప్ప, శివయ్య, మీసాల జయప్ప,తిప్పయ్య, కేశవులు, సుబ్రహ్మణ్యం, నాగరాజ, రంగప్ప ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.